సాక్షి
చిత్తూరు

సోమవారం, 17, జూలై, 2023



సామాన్య భక్తులకే ప్రాధాన్యం

శ్రీవారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు డయల్ యువర్ ఈఓలో ధర్మారెడ్డి తెలిపారు. - 8లో



పారదర్శకతకు ఈ-స్టాంపింగ్

రిజిస్ట్రేషన్లశాఖలో ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. జవాబుదారీతనం పెంచేందుకు చర్యలు చేపట్టింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	36	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

గజరాజుల జలకాలాట



చెరువులో జలకాలాడుతున్న ఏనుగులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గొనిచెరువులో ఆదివారం ఏనుగులు జలకాలాటలాడాయి. ఉదయం 8 గంటల సమయంలో కౌండిన్య అటవీ ప్రాంతంలో నుంచి మూడు ఏనుగులు చెరువు వద్దకు వచ్చాయి. సుమారు రెండు గంటల పాటు చెరువులో జలకాలాడుతూ సేదతీరాయి. తరువాత అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయాయి. ఏనుగుల సంచారం ఉండడంతో మొగిలి, మొగిలివారిపల్లె, టేకుమంద, బండ్లదొడ్డి, సామచేనుమిట్ట తదితర అటవీ సరిహద్దు సమీపంలో పొలాలు ఉన్న రైతులు, పశువులు, మేకల కాపరులు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు సమస్యల వినతులను అందజేయవచ్చని తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా స్పందనకు హాజరుకావాలన్నారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వు(ఏఆర్) కార్యాలయం జరిగే స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

వడ్డెర్ల సాధికారతకు కృషి

చిత్తూరు రూరల్: ఐక్య పోరాటాల ద్వారానే వడ్డెర్ల సాధికారత సాధ్యమని ఆ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రవీంద్రరాజు అన్నారు. చిత్తూరు నగరంలో ఆదివారం ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిత్తూరుకు చెందిన రవీంద్ర రాజు, కార్యదర్శిగా డీవీఎస్ మణి, కోశాధికారిగా గుడిపాల మండలానికి చెందిన సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్ర రాజు మాట్లాడుతూ వడ్డెర్లు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం సంఘం కమ్యూనిటీ హాల్ స్థలం కోసం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు.సంఘం డైరెక్టర్లు మొగిలి ఈశ్వర్ మనోహర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చండీగఢ్‌లో జవాన్ మృతి



హేమంత్(ఫైల్)

పూతలపట్టు: పూతలపట్టు మండలం అయ్యప్పగారిపల్లె పంచాయతీ తోటవారిపల్లెకు చెందిన ఆర్మీ జవాన్ హేమంత్ కుమార్(34) ఆదివారం మృతి చెందారు. గ్రామస్తుల వివరాల మేరకు.. ఈయన ఆర్మీలో హవల్దార్ విభాగంలో పనిచేస్తున్నారు. ఉద్యోగరీత్యా చండీగఢ్‌లో పనిచేస్తున్నారు. పచ్చకామెర్ల కారణంగా మూడు నెలలపాటు తోటవారిపల్లెలోనే భార్యా,పిల్లలతో ఉన్నారు. పది రోజులకు ముందు చండీగఢ్‌కు వెళ్లారు. ఆదివారం ఉదయం ఆరోగ్యం పరిస్థితి విషమంగా మారడంతో మృతి చెందారు. సోమవారం మృతదేహం తోటవారిపల్లెకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎర్రగొండేపల్లెలో జల్లికట్టు



పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ ఎర్రగొండేపల్లెలో ఆదివారం మైలేరు పండుగ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా జల్లికట్టు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పశువులను కట్టడి చేసే క్రమంలో ఇద్దరు గాయపడినట్లు సమాచారం. పశువుల పరుగు పందేలు నిర్వహించకూడదని పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేసినా నిర్వాహకులు లెక్కచేయలేదు.

బ్రహ్మాండం..
కాణిపాకం బ్రహ్మోత్సవం

సత్యప్రమాణాల దేవుడు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు దేవస్థానం రెండు నెలల ముందే శ్రీకారం చుట్టింది. లక్షలాదిగా తరలివచ్చే భక్తజనాన్ని దృష్టిలో ఉంచుకుని మహా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 18వ తేదీ వినాయక చవితి నుంచి 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్ద పీటవేస్తు, ఉభయదారులు, ప్రజాప్రతినిధులు, వీఐపీలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి చిన్న పొరబాటు చోటు చేసుకోకుండా దర్శనం కల్పించేలా ముందస్తు ఏర్పాట్లను ప్రారంభించింది.



కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవాలయం

భక్తుల రద్దీకి అనుగుణంగా

గతంలో బ్రహ్మోత్సవాలకు ముందు హడావుడిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేవారు. భక్తులకు ఈ సౌకర్యాలు సరిపోయేవి కావు. దీంతో ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించారు. ప్రత్యేక క్యూలు, నిత్య అన్నప్రసాదం, లడ్డూ, పులిహోరా ప్రసాదాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి వసతి, వీఐపీలు, సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనాలు, మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయంలో, ఊరేగింపులో స్వామివారిని దర్శించుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చిస్తున్నారు.

- సెప్టెంబర్ 18 నుంచి బ్రహ్మోత్సవాలు
- రెండు నెలల ముందు నుంచే ఏర్పాట్లకు దేవస్థానం శ్రీకారం
- అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు చర్యలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో స్వయంభుగా వెలిసిన శ్రీవరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు రెండు నెలల ముందే తగు ఏర్పాట్లకు నడుం బిగించారు. గతంలో కంటే ప్రస్తుతం వేలాదిగా భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివస్తున్నారు. నిత్యం భక్తులు 20 వేలకు పైగా విచ్చేస్తున్నారు. సెలవురోజుల్లో, పండుగ రోజుల్లో 50 వేలకు పైగా భక్తులు వస్తున్నారు. ఒక్కోసారి దర్శనానికి 6,7 గంటల సమయం కూడా పడుతోంది. బ్రహ్మోత్సవాల సమయంలో దర్శనం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు చూసేందుకు భక్తులు అశేషంగా తరలివస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులతో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తూ పలు అంశాలను చర్చిస్తూ, ఏర్పాట్లకు నిర్ణయాలు తీసుకుంటున్నారు. దేవదాయశాఖ ముఖ్య అధికారులతో కూడా నిర్ణయాలపై చర్చిస్తున్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. స్వామివారి దర్శనార్థం ఉదయం నుంచి భక్తులు తరలి రావడంతో కంపార్ట్‌మెంట్‌లు, క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు త్వరితగతిన దర్శనం చేసుకునేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు.



భక్తులతో నిండిన క్యూలు

భక్తులకు సంతృప్తి కలిగించేలా..



శ్రీవినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రాల నుంచి కూడా అశేషంగా తరలివస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో మాదిరి కాకుండా రెండు నెలలకు ముందు నుంచే మహా ఏర్పాట్లకు శ్రీకారం చుట్టాం. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ వీఐపీలకు ప్రత్యేక సమయం కేటాయించి ప్రత్యేక దర్శనం కల్పిస్తే బాగుంటుందని చర్చిస్తున్నాం. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు చాలా బాగా దర్శనం చేసుకున్నాం అనే సంతృప్తి కలిగించేలా ఏర్పాట్లు చేస్తాం.-మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్

భక్తులందరికీ నిత్య అన్న ప్రసాదం



ప్రస్తుతం నిత్యాన్నదానంలో 7 వేల మందికి భోజనం పెడుతున్నాం. బ్రహ్మోత్సవాల సమయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్న ప్రసాదం అందించాలని భావిస్తున్నాం. ఏర్పాట్లు బ్రహ్మాండంగా ఉండాలనే రెండు నెలలకు ముందే ముందస్తు చర్యలు ప్రారంభించాం. బ్రహ్మోత్సవాలకు వారం ముందే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులతో సమీక్షిస్తూ సలహాలు తీసుకుంటున్నాం. అన్నిశాఖల అధికారులు, ఉభయదారులతో సమన్వయంగా పనిచేస్తూ బ్ర హ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తాం

– వెంకటేశు, ఆలయ ఈఓ

భక్తజన బోయకొండ

- అమ్మవారిని దర్శించుకున్న 60 వేల మంది భక్తులు
- సేవా టికెట్లతో రూ.13.45 లక్షల ఆదాయం



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయం ఆషాఢ మాసం చివరి ఆదివారం భక్తజనంతో పోటెత్తింది. తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా ఊహించని రీతిలో భక్తులు రావడంతో రద్దీ నెలకొంది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు దర్శనానికి క్యూల్లో కిక్కిరిశారు. సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. వివిధ సేవా టికెట్ల విక్రయాల ద్వారా ఒక్క రోజే రూ.13.45 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. భక్తులు గంటల తరబడి వేచి ఉండి అమ్మవారిని దర్శించుకొన్నారు. కోర్కెలు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం ప్రతి భక్తుడికి అమ్మవారి కుంకుమ, పుష్పాలు, తీర్థప్రసాదాలు అందించే ఏర్పాట్లు చేశారు. కొండ పైనుంచి కింది భాగం వరకు వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా నిఘా ఏర్పాటు చేశారు.



క్యూలో వేచి ఉన్న భక్తులు

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్ : అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆణివార ఆస్థానం మహోత్సవాన్ని పురస్కరించుకొని టీటీడీ డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి ఆధ్వర్యంలో తిరుమంజనం చేపట్టారు. పరిమళ భరిత పచ్చ కర్పూరం, కిచిలీ గడ్డ, పసుపు, కుంకుమ, చందనం, సుగంధ ద్రవ్యాలతో కూడిన లేపనంతో ఆలయ ప్రాంగణంలోని గోడలు, స్తంభాలు, వాకిళ్ల పరిసర ప్రాంతాలను సంప్రోక్షణ చేశారు. లక్ష్మీనారాయణస్వామి, పాదాల మండపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి గర్భాలయాలను పరిశుభ్రం చేశారు. అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు కోలా లక్ష్మీపతి, సరోజ, పి.చంద్రకాంత్, లక్ష్మీ దంపతులు, జ్యోతి నూతన వస్త్రాలను స్వామివార్లకు, ఆలయ ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ మునికృష్ణయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, అర్చకుడు కె.మురళీకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోవడంతో కృష్ణ తేజ అతిథి గృహం వరకు భక్తులు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 87,171 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,273 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.68 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బస్ షెల్టర్‌ను ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల: మండలంలోని ఇరికిపెంట బంగ్లా వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఫౌండేషన్ (అమెరికా) నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం రెడ్డం వెంకటరమణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వేముల హరినాథ్, సర్పంచ్ రెడ్డెప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, నేతలు నాగభూషణం రెడ్డి, మిద్దింటి శంకరనారాయణ, రూన్సీలక్ష్మీ, ఒబులంపల్లె గాంధీ, ప్రభాకర, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సాగుకు ఊతం..రైతుకు దన్ను

రైతు శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోంది. పంటల సాగులో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఊతమిస్తోంది. పెట్టుబడి సాయం, రాయితీపై విత్తనాలు, పంటలకు ఉచిత బీమా, ప్రకృతి వైపరీత్యాలతో ఏర్పడే పంటలకు పరిహారం సైతం అందిస్తోంది. దిగుబడులను గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని విధాలా భరోసాను ఇస్తుండడంతో పంటల సాగుకు మరింత ఉత్సాహంతో రైతులు ముందుకు వస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో రుతుపవనాల ఆలస్యంతో పంటల సాగు కొంత ఆలస్యమవుతోంది. ప్రకృతి అనుకూలించక పోవడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రోత్సాహం కరువైందంటూ ముడిపెడుతూ పచ్చమీడియా తప్పుడు కథనాలను వల్లెవేస్తోంది.



పలమనేరు: ఖరీఫ్ దుక్కు పనుల్లో రైతులు

- నాడు అనాసక్తత
- నేడు ఉత్సాహంగా వ్యవసాయం
- ఆర్బీకేలతో రైతుల ముంగిటే సేవలు
- వాతావరణం అనుకూలించక ఖరీఫ్ సాగు కొంత ఆలస్యం
- ప్రకృతికి, ప్రభుత్వానికి ముడిపెడుతూ పచ్చమీడియా తప్పుడు కథనాలు

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో ఏటా 1.20 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు దాదాపు 90 వేల హెక్టార్లలో, వర్షాధారంగా వేరుశనగ పంట అత్యధికంగా 51 వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో రైతులు సాగులోకి తీసుకువస్తారు. రబీలో అన్ని రకాల పంటలు దాదాపు 30 వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో సాగవుతుంది. ఉద్యాన పంటల కింద ప్రధానంగా మామిడి అత్యధికంగా దాదాపు 58 వేల హెక్టార్ల మేరకు సాగులో ఉంది. పడమటి మండలాల పరిధిలో ప్రధానంగా టమాటా ఏడాదికి మూడు దఫాల్లో దాదాపు 10 వేల హెక్టార్లలో సాగవుతుంది.

నాడు అనాసక్తత...


గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి ఎలాంటి ప్రోత్సాహం లేకపోగా రైతులకు కనీస భరోసా ఉండేది కాదు. సాక్షాత్తు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగ అంటూ రైతులను నిర్లక్ష్యం చేశారు. సాగైన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలపాలైనా అప్పటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం నష్టపరిహారం చెల్లించడంలోనూ రైతులకు శీతకన్నే ఎదురయ్యేది. పంటలకు బీమా సౌకర్యం పొందాలన్నా రైతులు అధిక మొత్తాల్లో ప్రీమియం చెల్లించాల్సిన దుస్థితి. బీమా చేసుకున్నా పరిహారం అంతంత మాత్రమే అందేది. దిగుబడి అయిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అయినకాడికి అమ్ముకుని నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి. కేవలం వేరుశనగ విత్తనకాయలకు మాత్రమే రాయితీకి అందించేది. వాటిలో కూడా నాశిరకమే. రాయితీపై తక్కువ ధర ఉన్న జిప్సం, విత్తన శుద్ధి మందులను మాత్రమే అందించేంది. అవికూడా కొందరు రైతులకు మాత్రమే పరిమితంగా ఉండేది. వ్యవసాయానికి విద్యుత్ సౌకర్యం కూడా అంతంత మాత్రమే ఉండేది. రాత్రి వేళల్లో సాగుకు సరఫరా చేయడంతో పంటలకు నీరు అందించడంలో అనేక ప్రమాదాలకు గురై రైతులు ప్రాణాలు సైతం ఫణంగా పెట్టాల్సి వచ్చేది. వ్యయప్రయాసలు ఎక్కువ కావడంతో పంటల సాగును క్రమేణా తగ్గించేశారు.

నేడు వ్యవసాయానికి ఊతం

ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వ్యవసాయానికి పెద్దపీట వేసి అన్ని విధాలా రైతులకు ఊతమిస్తోంది. దుక్కి, విత్తు నుంచి పంట దిగుబడి, వాటికి గిట్టుబాటు ధర వరకు ప్రభుత్వమే అన్ని తానై వ్యవహరిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 502 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లోనే రైతులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. ఏటా పంటల సాగుకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో ముందస్తు పెట్టుబడికి రైతు భరోసా పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.13,500 మేరకు అందించి ఆర్థిక భరోసానిస్తోంది. రాయితీపై నాణ్యమైన విత్తనాలను అందిస్తోంది. ఈ ఖరీఫ్ సీజనుకు రాయితీపై వర్షాధారంగా సాగయ్యే వేరుశనగ విత్తనకాయలను 41,080 క్వింటాళ్ల మేరకు అందించింది.

వీటితో పాటు ప్రస్తుతం 50 శాతం రాయితీపై 990 క్వింటాళ్ల మేర రాగులు అందిస్తోంది. ఉచితంగా 136 క్వింటాళ్ల రాగులు మినీ కిట్లను రైతులకు అందిస్తోంది. కందులు 600 క్వింటాళ్లు ఉచితంగా అందిస్తోంది. సాగైన ప్రతి పంటను ఈ-క్రాప్ నమోదు చేసి ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో 33 శాతంకు పైబడి నష్టపోయిన పంటలకు పరిహారాన్ని అందిస్తోంది. వ్యవసాయానికి పగటిపూటే 9 గంటల మేరకు విద్యుత్‌ను సరఫరా చేసి రైతులకు సాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా సరసమైన ధరలకు ఎరువులు, పురుగు మందులు అందిస్తోంది. దిగుబడి అయిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలుచేసి రైతులను ఆదుకుంటోంది. పంటల యాజమాన్యంలో రైతులకు మెళకువలను క్షేత్రస్థాయిలోనే ఆయా గ్రామాల రైతు భరోసా సిబ్బంది ద్వారా సకాలంలో అందించి నాణ్యమైన దిగుబడికి దోహదపడుతోంది. ఇలాంటి ప్రోత్సాహంతో రైతులు పంటల సాగుకు చురుగ్గా ముందుకు వస్తున్నారు.


వ్యవసాయానికి మంచిరోజులు



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి మంచి తోడ్పాటును అందిస్తోంది. పంటల సాగుకు ముందస్తుగానే పెట్టుబడిని అందించి ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటలకు పరిహారాన్ని ఇవ్వడమే కాకుండా, దిగుబడి అయిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకుంటోంది.

– ఎస్.మురళి, రైతు, కావేరిరాజపురం, పాలసముద్రం మండలం

గతంలో ఎలాంటి ప్రోత్సాహం లేదు..



గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి ఎలాంటి ప్రోత్సాహం లేదు. రాయితీ పేరుతో నాశిరకం విత్తనాలు అందించేవారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినా కనీస పరిహారం కూడా అందించేవారు కాదు. దిగుబడి అయిన పంటలకు అప్పటి ప్రభుత్వం ప్రోత్సాహం అందించకపోవడంతో నష్టానికి దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. మామిడి కాయలు అయితే ధరలేక రోడ్లపై పారబోయాల్సి వచ్చింది.

– తిమ్మారెడ్డి, రైతు, యాదమరి మండలం

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు



దగ్ధమైన వస్తువులు

పలమనేరు: మండలంలోని సాకేవూరులో ఆదివారం సరస్వతి ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. అగ్ని మాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో గాయపడిన సరస్వతిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించినట్లు అగ్ని మాపక సిబ్బంది తెలిపారు. ఇంట్లో రూ.పది వేల విలువైన పరికరాలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు..

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కుప్పంరూరల్: కుప్పం మండలం, విజలాపురం వద్ద జరిపిన దాడుల్లో 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు కుప్పం సెబ్ సీఐ కిశోర్‌కుమార్ చెప్పారు. ఆదివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఓమెనీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందు 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, రామకుప్పం మండలానికి చెందిన బాలచంద్రను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ రామమ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

పారదర్శకతకు ఈ-స్టాంపింగ్

రిజిస్ట్రేషన్లశాఖలో పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. క్రయవిక్రయదార్లకు మెరుగైన సేవలందించేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా స్టాంపుల కొనుగోలులో అవకతవకలకు తావు లేకుండా ఈ-స్టాంపింగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. మాన్యువల్ పద్ధతులకు స్వస్తి పలికి ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది.

- మరింత సులువుగా స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు
- నాన్ జ్యుడీషియల్‌కు సమానంగా ఈ-స్టాంపులు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు



చిత్తూరులో ఏర్పాటు చేసిన ఈ స్టాంప్ కౌంటర్



రూ.100 ఈస్టాంప్ పేపర్

చిత్తూరు కార్పొరేషన్ : రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చింది. లావాదేవీలు, దస్తావేజు తయారీ, నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాల్లో పారదర్శకతను పెంచింది. ఇప్పుడు నాన్ జ్యుడీషియల్ స్టాంపులతో సమానంగా ఈ-స్టాంపులను అందుబాటులోకి వచ్చింది. ఈ క్రమంలో వినియోదారులు అపోహలు పక్కన పెట్టి ఈ-స్టాంపింగ్‌ను వాడుకోవాలని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది కోరుతున్నారు. కర్ణాటకలో ఈ విధానం విజయవంతంగా నడుస్తుండడంతో రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ పూర్తిస్థాయిలో సర్వే చేసి ఇక్కడ ప్రవేశపెట్టింది. పారదర్శక, జవాబుదారీతనం, వేగవంతంగా ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ సర్వీసులు ప్రారంభించింది. అందులో ప్రదానంగా రికార్డుల డిజటలైజేషన్, ఈసీ, సీసీ, ఫర్మ్‌లు, సొసైటీలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

పాత తేదీలకు స్వస్తి

నాన్‌జ్యూడీషియల్ స్టాంపుల విక్రయాల్లో అవకతవకలను అరికట్టాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ-స్టాంపింగ్‌ను అమల్లోకి తెచ్చింది. పాత తేదీలతో నాన్ జ్యుడీషియల్ స్టాంపులను కోనుగోలు చేసి వాటి ద్వారా నకిలీ అగ్రిమెంట్లు సృష్టించుకునే వారికి నూతన విధానంతో పూర్తి స్థాయిలో చెక్ పెట్టింది. ఇకపై ఏ రోజుకారోజు అనే నినాదంతో ఈ- స్టాంపుల విక్రయాలను చేపట్టింది. ఇందు కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించింది.

జిల్లాలో 8 కేంద్రాలు

జిల్లాలోని 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-స్టాంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు చిత్తూరులో 9, బంగారుపాళ్యం-2, కార్వేటినగరం-4, కుప్పం-12, నగరి-2, పలమనేరు-11, పుంగనూరు-6 చొప్పున మొత్తం 46 సెంటర్లలో సేవలను అందుబాటులో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఒకటి, రెండు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు మినహా రూ.100 స్టాంపుల విక్రయాలను నిలుపుదల చేశారు. మరో నెలలో అన్నిచోట్ల రూ.100 స్టాంపుల అమ్మకాలను నిలిపి వేయనున్నారు. ఈ క్రమంలో వినియోగదారులు సైతం ఈ-స్టాంపింగ్ వైపు మొగ్గుచూపాలని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వివరాలు ఇవీ..

- పారదర్శకత, వేగవంతం జవాబుదారీతనమే లక్ష్యంగా ఈ-స్టాంపింగ్ ద్వారా ప్రజలకు సులువుగా సేవలు అందుతాయి.
- కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ), స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లో ఈ-స్టాంప్స్ లభిస్తాయి.
- అన్ని రకాల రిజిస్ట్రేషన్లు, నాన్ రిజిస్ట్రేషన్లకు ఈ-స్టాంప్స్ ఉపయోగించుకోవచ్చు.
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-స్టాంప్ కౌంటర్ ద్వారా అన్ని రకాల చెల్లింపులకు సౌకర్యం ఉంటుంది.
- ఆర్ఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా జిల్లాలవారీగా సీఎస్ఈ వివరాలు పొందవచ్చు.
- లైసెన్స్ పొందిన స్టాంప్ వెండర్ సీఎస్‌సీ సెంటర్స్, బ్యాంకుల వద్ద ఇతర ఆర్థిక వ్యవహారాలను నిర్వహించే సంస్థల వద్ద ఈ-స్టాంప్స్ దొరుకుతాయి.
- నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌కు సమానమైన విలువ, సమాంతరమైన సేవలు ఈ-స్టాంపింగ్‌లో అందుబాటులో ఉంటాయి.

నూతన విధానం



రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖలో మరింత పారదర్శకత పెంచేందుకు నూతన విధానాన్ని ప్రవేశపెట్టారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపుతో సమానమైన ఈ-స్టాంప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిపై ఎవరూ అపోహ పడాల్సిన అవసరం లేదు. ఈ స్టాంపింగ్ విధానంతో సులువుగా లావాదేవీలు నిర్వహించుకునే వెసులుబాటు ఉంది.

– శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

రామకుప్పం: మండలంలోని ఆనిగానూరుకు చెందిన బాలికను అపహరించి, అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు, కుప్పం మండలం వేపూరుకు చెందిన చంద్రశేఖర్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట కిడ్నాప్ కేసును నమోదు చేసిన పోలీసులు బాలిక ఇచ్చిన వాంగ్మూలం మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం చంద్రశేఖర్ మల్లానూరు సమీపంలో ఉన్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ సీఐ శ్రీధర్ సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. నిందితుడిని కుప్పం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం



వివరాలు వెల్లడిస్తున్నసీఐ ఆశీర్వాదం



సీజ్ చేసిన బియ్యం లారీ

వి.కోట: గంజాయి సరఫరాపై ఉక్కు పాదం మోపుతున్నట్లు సీఐ ఆశీర్వాదం తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా నాలుగు కేసులు నమోదు చేసి 16 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి విక్రేతలను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుదవగడ్డ సరిహద్దు ప్రాంతంలోని నాయకనేరి వద్ద వాహనాల తనిఖీ సమయంలో రెండు ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న 5కిలోల గంజాని స్వాధీనం చేసుకున్నామని, తమిళనాడుకు చెందిన సుబ్రమణ్యం, రెహ్మాన్ ,ఇమ్రాన్ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే ఆదివారం మండలంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో నాకాబంది నిర్వహిస్తుండగా తమిళనాడు నుంచి కర్ణాటక అక్రమంగా చౌక బియ్యం తరలిస్తున్న మినీలారీని పట్టుకున్నట్లు తెలిపారు. 50 బియ్యం బస్తాలను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కురబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప, పాల్గొన్న కురబ సంఘ నాయకులు

మదనపల్లె : రాయలసీమలో అధికసంఖ్యలో ఉన్న కురబలకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కురబసంఘం రాష్ట్ర నాయకులు, రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప తెలిపారు. ఆదివారం పట్టణంలోని అయోధ్యనగర్ శ్రీరామ కల్యాణ మండపంలో రాష్ట్ర కురబల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి కర్నూలు, అనంతపురం, ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన కురబకుల ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప మాట్లాడుతూ.. కురుబలలో ఐక్యత లేని కారణంగా తీవ్రంగా నష్టపోవడం జరుగుతోందన్నారు. అందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని, సామాజికంగా, ఆర్థికంగా పైకి వచ్చేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులు తమకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న 36 నియోజకవర్గాల్లో కుప్పం నుంచి కర్నూలు వరకు 30లక్షలకు పైగా కురుబలు ఎన్నికల్లో గెలుపు, ఓటములు నిర్దేశించేస్థాయిలో కీలకంగా ఉన్నామన్నారు. అనంతపురం జిల్లాలో వైఎస్సార్ సీపీ 2 ఎమ్మెల్యేలు, 1 ఎంపీ, 1 బీసీ కమిషన్ మెంబర్‌గా అవకాశం కల్పించిందని, కర్నూలు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధిక సంఖ్యలో కురుబలు ఉన్నప్పటికీ అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు.

దేశజనాభాలో 50శాతానికి పై గా ఉన్న బీసీ జనాభాకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు, సమాన అవకాశాలు దక్కడం లేదన్నారు. కురబలు ఇతర బీసీ కులాలతో సమన్వయం చేసుకుని రాజ్యాధికారం దిశగా ముందుకెళతామన్నారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండురామాంజులు, నాయకులు బెల్లేరెడ్డిప్రసాద్ మాట్లా డుతూ కనకదాస విగ్రహాలను ప్రతినియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు స్థలాలను కేటాయించాలన్నారు. మాదాసి, మాదారి కురబలకు రెవెన్యూఅధికారులు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కురబ సంఘం నాయకులు ఆరెళ్ల జయప్ప, బోరంపల్లె ఆంజనేయులు, ఎస్.ఈశ్వరయ్య, నాగభూషణం, దొనస్వామి, బుల్లేలింగప్రసాద్, కనుగొండ్లరాజేష్, సామకోటి ఆదినారాయణ, జెడ్పీటీసీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రెండు తలల దూడ జననం



రెండు తలలతో జన్మించిన దూడ

కుప్పంరూరల్: రెండు తలలతో దూడ జన్మించిన సంఘటన కుప్పం మండలం, వేపనపల్లెలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వేపనపల్లెలోని కనకరాజుకు చెందిన ఆవుకు శనివారం అర్ధరాత్రి ఈనేందుకు నొప్పులు ప్రారంభమయ్యాయి. కనకరాజు, స్థానికులు ఇది గురించి ఆవు నుంచి దూడను లాగేందుకు ప్రయత్నించారు. అయితే మొదటి తల, ముందరికాళ్లు రావాల్సి ఉండగా, ఈ ఆవుకు మాత్రం మొదటి వెనుకటి కాళ్లు వచ్చాయి. లోపల ఉన్న రెండు తలల దూడను గమనించని స్థానికులు దూడను బయటికి లాగారు. పూర్తిగా బయటకు వచ్చిన దూడకు రెండు తలలు ఉండడంతో వారు ఆశ్చర్యానికి గురయ్యారు. అయితే అప్పటికే దూడ మృతి చెందింది. ఆవు పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు స్థానికులు చెప్పారు. జన్యుపరమైన సమస్యలతోనే రెండు తలల దూడ జన్మించిందని వైద్యులు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన శంకరప్ప

పుంగనూరు: పట్టణంలో ఆదివారం కొత్త యిండ్లు హైస్కూల్ బస్ స్టాప్ వద్ద ప్రవేటు బస్సు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బోడినాయునిపల్లెకు చెందిన శంకరప్ప(55) సొంత పనుల నిమిత్తం పుంగనూరుకు నడచుకుంటూ వచ్చాడు. బస్‌స్టాప్ వద్ద నిలబడి ఉండగా అతివేగంగా వచ్చిన ప్రవేటు టూరిస్టు బస్సు శంకరప్పను ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. శంకరప్ప మృతితో గ్రామంలో విషాధ చాయలు అలుముకున్నాయి. ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని శవం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు పట్టణం పెనుమూరు క్రాస్ సమీపంలో రైలు పట్టాలపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతిడి వయస్సు 25-30 సంవత్సరాల మధ్య ఉండవచ్చు. నల్ల రంగు టీషర్టు, నల్లరంగు షార్ట్ వేసుకుని ఉన్నాడు. కుడి చేతిపై త్రిశూలం ఆకారంలో పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆచూకి తెలిసినవారు 9494228854 నంబర్ లేదా చిత్తూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: కట్టమంచి వినాయకుడి వీధికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఈశ్వర్ (29) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తాళలేక ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

తిరుమల : శ్రీవారి దర్శనార్థం విచ్చేసే సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఆదివారం తిరుమల అన్నమ య్య భవన్‌లో నిర్వహించిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ నాదనీరాజనం వేదికపై ఈ నెల 3వ తేదీ నుంచి శ్రీమద్భాగవత ప్రవచనం సాగుతోందన్నా రు. రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేస్తోందని వెల్లడించారు. శ్రీ కుప్పా విశ్వనాథశర్మ చేపట్టిన ప్రవచనానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. అనంతరం భక్తులతో ఫోన్‌లో మాట్లాడారు..

- **ప్రవీణ్ కుమార్, మహారాష్ట్ర** : అంగప్రదక్షిణ టోకెన్లను ఆఫ్‌లైన్‌లో కూడా ఇవ్వండి.
  ఈఓ : భక్తుల సౌకర్యార్థమే ఆన్‌లైన్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు జారీ చేస్తున్నాం.
- **స్వామి, అనంతపురం** : శ్రీవారి సేవకు వచ్చాం. ఫోన్ నంబర్ మార్చాలని విజ్ఞప్తి చేశాం. అయితే కొత్త నంబర్ నమోదు చేసుకోవడం వీలుకాలేదు.
  ఈఓ : తప్పకుండా మారుస్తాం.
- **శంకర్ గౌడ్, హైదరాబాద్** : 3 నెలల ముందుగా రూ.300 దర్శన టికెట్లు విడుదల చేస్తున్నారు. మహిళలకు ఇబ్బందిగా ఉంటుంది. ఒక నెల ముందు మాత్రమే విడుదల చేస్తే బావుంటుంది.
  ఈఓ : ఎక్కువమంది భక్తుల కోరిక మేరకు 3 నెలల ముందుగా రూ.300 దర్శన టికెట్లు విడుదల చేస్తున్నాం. ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి 4 వేల టికెట్లను అదనంగా విడుదల చేస్తాం.
- **దుర్గాప్రసాద్, అనకాపల్లి** : లక్కీ డిప్‌లో ఆర్జిత సేవా టికెట్లు దొరకడం లేదు.
  ఈఓ : లక్కీ డిప్‌లో ఆర్జిత సేవా టికెట్లు తక్కువగా ఉన్నాయి. స్వామివారిని ప్రార్థించి ప్రయత్నించండి.
- **హరి, మంచిర్యాల** : సీనియర్ సిటిజన్లకు కాటేజీల్లో గ్రౌండ్ ఫ్లోర్ వచ్చేలా చూడండి.
  ఈఓ : రిసెప్షన్ అధికారులకు ఈ మేరకు ఆదేశాలిస్తాం.
- **మనోహర్, జగిత్యాల** : తలనీలాలు సమర్పించే ప్రాంతంలో క్షురకులు డబ్బులు అడగకుండా కంట్రోల్ చేయండి.
  ఈఓ : భక్తులు ఎవరూ డబ్బులు ఇవ్వకపోతేనే సమస్య పరిష్కారం అవుతుంది. క్షురకులు డబ్బులు తీసుకుంటున్నట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. వారికి తరచూ కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం.
- **కర్నూలు, రతీదేవి** : శ్రీవారి సేవకులకు సేవాసదన్‌లో అన్నప్రసాదాలు అందించండి.
  ఈఓ : శ్రీవారి సేవకుల కోసం వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ప్రత్యేకంగా హాలు కేటాయించాం. సేవాసదన్‌లో కూడా అన్న ప్రసాదాలు అందించే విషయాన్ని పరిశీలిస్తాం.
- **రవికుమార్, బెంగళూరు**, సుహాసిని, నంద్యాల : బంగారు వాకిలి వద్ద టీటీడీ సిబ్బంది భక్తులను లాగేస్తున్నారు. భక్తులకు ఇబ్బందిగా ఉంది.
  ఈఓ : భక్తులందరికీ సంతృప్తికరంగా దర్శన భాగ్యం కల్పించేందుకు మహాద్వారం నుంచి గర్భాలయం వరకు ఒకే వరుస విధానాన్ని అమలు చేస్తున్నాం.
- **రెడ్డి, రాయచోటి** : తిరుపతి రైల్వే స్టేషన్, విష్ణునివాసం వద్ద భిక్షకులు, అపరిచిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉంది. విష్ణునివాసంలో ఎస్ఎస్‌డీ టోకెన్లకు సంబంధించి సూచిక బోర్డు లేదు.
  ఈఓ : రైల్వే స్టేషన్, విష్ణు నివాసం ప్రాంతాల్లో భిక్షకులు, అపరిచిత వ్యక్తుల సంచారంపై జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తాం. విష్ణు నివాసంలో ఎస్ఎస్‌డీ టోకెన్లకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం.
- **మణికంఠ, పలమనేరు** : లడ్డూ కౌంటర్ వద్దకు కుటుంబ సభ్యులందరూ వెళితేనే లడ్డూలు ఇస్తున్నారు. లేకపోతే ఇవ్వడం లేదు.
  ఈఓ : దళారులను అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. భక్తులు సహకరించగలరు.
- **మునిలక్ష్మి, నెల్లూరు** : ఆర్జిత సేవలు, వర్చువల్ సేవలు ఒకేరోజు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నారు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. వేర్వేరు రోజుల్లో విడుదల చేస్తే సౌకర్యంగా ఉంటుంది.
  ఈవో: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
- **శ్రీరామ్, విశాఖ** : వికలాంగులు, వృద్ధులను ఒకేసారి కాకుండా వేర్వేరుగా దర్శనానికి పంపితే బావుంటుంది.
  ఈవో : అలాగే పంపుతాం.
- **హనుమంతరావు, గుంటూరు** : తిరుమలలో గది తీసుకున్నాం. డిపాజిట్ రీఫండ్ రాలేదు.
  ఈఓ : మీకు ఫోన్ చేసి రీఫండ్ వివరాలు తెలియజేస్తాం.
- **వేణుగోపాల్, హైదరాబాద్**: ఎస్వీబీసీ తెలుగు ఛానల్‌లో ఇతర భాషల కార్యక్రమాలను నిలుపుదల చేయండి.
  ఈఓ : భక్తులకు సౌకర్యంగా ఉండేలా కార్యక్రమాలు ప్రసారం చేస్తాం.
- **రాజు, వనపర్తి** : శ్రీవారి మెట్టు మార్గంలో లగేజ్ డిపాజిట్ చేసి నడిచి వచ్చాం. తిరుమలలో తిరిగి తీసుకోవడం ఇబ్బందిగా మారింది.
  ఈఓ : లగేజ్ కలెక్షన్, డెలివరీ సిస్టం పేరుతో నూతన వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఈ వ్యవస్థలో క్యూఆర్ కోడ్ స్లిప్ జారీ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా లగేజీ అందజేస్తాం.
- **ఈశ్వర్ ప్రసాద్, ఐరాల** : శ్రీవారి మెట్టు మార్గంలో అల్పాహారం కోసం దుకాణాల వద్ద అధిక ధరలు వసూలు చేస్తున్నారు.
  ఈఓ : అధిక ధరలు వసూలు చేస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. శ్రీవారి మెట్టు మార్గం మొదట్లోనే అన్నప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.
- **మధు కులకర్ణి, కర్ణాటక** : తిరుమలలో గదులు పొందిన భక్తులు మరో రెండు రోజులు పొడిగించుకునే అవకాశం కల్పించండి.
  ఈఓ : తిరుమలలో గదుల లభ్యత పరిమితంగా ఉంది. ఎక్కువమంది భక్తులకు అవకాశం కల్పించాలి కాబట్టి 2 రోజులు పొడిగించుకునే అవకాశం లేదు.
- **వెంకటరమణమూర్తి, హైదరాబాద్** : ఎన్నారై భక్తురాలు దర్శన టికెట్ కోసం ప్రయత్నిస్తే ఇవ్వలేదు.
  ఈఓ : ఎన్నారైలు తమ అర్హతను చూపితే రూ.300 టికెట్ జారీ చేసి స్వామివారి దర్శనం కల్పిస్తున్నాం.
- **రామిరెడ్డి, కర్నూలు** : కర్నూలులో శ్రీవారి లడ్డూలు పొందే అవకాశం కల్పించండి.
  ఈఓ : హైదరాబాదుకు లడ్డూలు తీసుకువెళ్లే వాహనం ద్వారా కర్నూలులో ప్రయోగాత్మకంగా వెయ్యి లడ్డూలతో ఈ సౌకర్యం కల్పిస్తాం.

కార్యక్రమంలో టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్ రెడ్డి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, అన్న ప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి, వీజీఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.